కొన్ని గజాల దూరంవుంది. యింతలో ధూమ్యాశ్వ కాశాలు దద్దరిల్లేటట్లు వందలకొద్దీ సైనికులు గుర్రాలమీదవచ్చి పల్లకిని ముట్టడించారు. పల్లకిని తిరిగి కోటవైపు నడిపించారు. పరస్పర బాహు బంధాలలో బంధింపబడవలసిన ప్రేయసీ ప్రియుం లలో ప్రేయసి అంతఃపురంలోను- ప్రియుడు చెర సాలలోను బంధింప బడ్డారు. యీవార్త తెలిసిన సోమశర్మ-వెనక్కి తిరిగిచూడకుండా తన రాజ్యం లోకి పారిపోయాడు. దీనితో కథ ఆగిపోయింది.

కుముదినీ శశివర్మల ప్రేమ ఫలించినదా? పారిపోయిన సోమశర్మ తనరాజుతో చెప్పి సైన్య సమేతంగా యీ రాజ్యాల మీదికి యుద్ధానికి వస్తాడా?

యుద్ధంలో సుందరవర్మను ఓడించి శశివర్మను విడిపిస్తాడా? శశివర్మ కృషీవల కుమారుడు కాక రాజకుమారుడని తెలిసిన తరవాత కుముదిని ప్రేమ యింకా అతనిమీద నిలుస్తుందా?

కుముదినీ శశివర్మల ప్రేమ గాఢంగా నిలిచినా సామ్యవాదినిని తనకొడుకునకు వివాహం చెయ్య డానికి శశివర్మతండ్రి అంగీకరిస్తాడా?

కుముదినీ శశివర్మల ప్రేమ నిలిచి - శశివర్మ తండ్రి యీ పెళ్ళికి అంగీకరించి- చివరకు యిద్దరి ప్రేమా ఫలించి - యిద్దరూ ఆ రాజ్యానికి రాజు రాణీ అయిన తరవాత వారు తమ పదవులను రద్దుపరచుకొని ఆ రాజ్యంలో సామ్యవాద సిద్ధాం తాలను ప్రవేశపెడతారా?

ఈ సందేహాలన్నిటికీ సమాధానాలు మీరే వూహించండి.

---

స్కెచ్

# "శిరసి మా లిఖ"

ఇచ్ఛాపురపు జగన్నాధరావు

"ఈ ఇంటివారెవరండి!"

"ఎవరూ?"

"ఈ ఇంటివారు—సొంతదారులు..."

"అది సరేలెండి—మీ రెవరూ అనీ అడ గడం..."

"నే నెవరినని చెప్పుకోను లెండి! అయినా మీరేనా ఇంటివారూ?"

"కాకపోతే మీరెవరో చెప్పరా ఏం?"

"ఎందుకు చెప్పాలో నా కర్థం కావడంలేదు"

"గౌరవంగా ఎవరని అడిగితే ఇంత అర్థాలూ తెలియకపోడాలూ ఎందుకో! పాడుకాలం—"

"నా ఒక్కణ్ని గురించి కాలాల నన్నిటినీ తిట్టేడం ఎందుకులెండి గాని, ఈ ఇంటివారు ఎవరూ?"

"తెలీక అడుగుతానూ - వారంటు ఏమైనా తెచ్చావా నాయినా?"

"వారంట్లు తెచ్చే ఉద్యోగం దొరకలేదుగానీ, అసలా సందేహం ఎందుకు వచ్చింది దొడ్డమ్మ గారూ?"

"అహో...అసలు నువ్వు ఇంటివారిని ఏ జన్మలోనైనా చూశావా అని—"

"ఈ ఇంటివారిని నిజంగా చూడలేదు లెండి"

"పోనీ-ఏ ఇంటివారినైనా—"

"చాలామందిని చూసేను"

"అదిగో! అచ్చు అలాగే అంటూఉండేవాడు మా రెండోపిల్ల సవితి తమ్ముడు మేనమామ... నలభై ఏళ్లు నిండాయో లేదో—గుటుక్కు మన్నాడు...పాపం. ఆపిల్ల అదృష్టం."

"దురదృష్టం అనండి."

"ఎందుకనాలీ? బ్రతికున్నన్నాళ్లు కాల్చుకుని తిన్నాడు."

"పోనీండి...ఆవిడ అదృష్టవంతురాలు."

"అదృష్టం!...నువ్వెవరోగానీ, నువ్వే అనాలి. అయిదురు పిల్లల్ని దాన్ని లోకానికి వప్పజెప్పి హరీమని ఊరుకున్నాడు."

"ఎంతకష్టం!"

"అదేం మాటయ్యా! సాలీనా పదేనువొంద లొచ్చేభూములూ పదివేల ఇంసురెంసూ...అన్నీ

గాక డాబాహోటల్లో సినిమాలాంటి ఇల్లు... అన్నీ దానికే వచ్చాయిగా!"

"ఏ సంఘటనకేనా రెండురకాల ఫలితాలు ఉంటాయి లెండి."

"అన్నావా...అచ్చం కథలు రాసేవాడిలా అన్నావు. ఐతే, నువ్వూ కథలు రాస్తావేమిటీ?"

"ఏదో-అప్పుడూ అప్పుడూ."

"ఇంకేం! అయితే సరేనన్న మాట! మా మూడోవాడి బావమరిది తోడల్లుడూ కథలు రాస్తూనే ఉంటాడులే."

"ఆయనకి చాలా పేరుంది కాబోలు."

"ఉండకేం! సుబ్రహ్మణ్య సోమయాజీ సత్య నారాయణమూర్తిగారు-పెద్దదే!"

"చాలా పెద్దదేనండి."

"అన్నావా? వాళ్ళమామగారి రెండో అల్లుడి ఇల్లు నువ్వు చూస్తే ఆ మాట అనవ్. అది మరీ పెద్దది."

"వాటికి సామ్యం ఏమిటి లెండి-వీటి కవే."

"అలా అనకు. ఒక్కొక్కళ్ళకి మహాయోగం ఉంటే అన్నీ పెద్దవే వొస్తాయి. జాతకాలంతే. మా ఆయన ఎప్పుడూ అలాగే అంటూ ఉండే వారు."

"అది నిజమేనేమో లెండి."

"నిజంకాక, అబద్ధం నేనెందుకాడతానయ్యా? నాకు ఆడపిల్లలున్నారంటే, అది మగాళ్ళాడేన అబద్ధాలు. నేను అక్కడికే ప్రతిదినం ప్రాయ చిత్తం చేసుకుంటూనే ఉండేదాన్ని."

"ఈ ఇంటి......"

"ఆం...అసలు సంగతి వొదిలేశాను. ఇంటి వాళ్లెలా ఉంటారో ఎప్పుడైనా చూశావా అని అడుగుదామనుకుంటూ, ఇన్ని దార్లు పట్టేను... మందమతి. ఆయన బతికున్నరోజుల్లో ఒక్కపని కూడా ఎన్నడూ తారుమారు చెయ్యలేదు. ఓ సారి మా యింటి పక్క పురాణంచెప్పే శాస్త్రిలు గారు పతివ్రతకి ఉదాహరణగా..."

"వారిప్పుడు..."

"చచ్చారులెండి. ఇంకా ఎలా ఉంటాడూ?"

"జబ్బుకాబోలు."

"మగాళ్ళందరికీ ఒకటే జబ్బు-త్వరగా చచ్చి పోడం."

"మీరు మరీ అన్యాయంగా మాట్లాడుతున్నా రండి"

"కొడుకులాటి వాడవ్... వెయ్యేళ్ళు బతుకు నాయనా. అంతేగాని, నేను చేసేదీ చెప్పేదీ అన్యాయం అనిమాత్రం అనకు. పుణ్యముంటుంది."

"పోనీండి—మీరు చాలా నిజంగా చెప్పేరు గానీ—అలాంటి..."

"ఆ దేనయ్యా! అసలువిషయానికొస్తూంటే అడ్డమైన పెడదారులూపట్టించి వాగిస్తున్నావు. ఇంటి వారికుందా, ఆ గర్వం, దర్పం..."

"మీరు ఈ ఇంటివారనుకుంటాను."

"గర్వం, దర్పం, మా వంశంలో పుట్టుకొచ్చా యయ్యా! చూశావా! చక్కగా గ్రహించావు.. చాలా చదువుకున్నావా నాయినా?"

"ఇలాటివాటికి చదువులెందుకులెండి."

"నీకడుపు చల్లగా-నిజం చెప్పేవుబాబూ.. నువ్వెవ్వవరివో గాని ..ఎందుకూ చదువూ? మా నాలుగో కోడలు ఇంటురు పేసయిందోలేదో నువ్వెరుగుదువా?"

"నాకెలా తెలుస్తుందండి?"

"అలాఅనకు—కొన్ని విషయాలు ఎలాగేనా తెలుస్తాయి. ఈ విషయం ఈ వీధివారందరికీ తెలుసును. అసలు దాన్ని చూడగానే చెప్పేవొచ్చును-అది ఇంటరు పేసవలేదని."

"అలాగేనండి."

"మరి, నీకేం తెలుసూ?"

"మీరు చెప్తున్నారుకాదా?"

"చెప్తే అంతే?...ఇంకోగంటపోయాక నువ్వూ చాలా మంచివాడివని అందరితోనూ చెప్తాను. అంతే?"

"మనం వాదించడం అనవసరం. ఇంతకీ—"

"ప్లీడరీకిమాత్రం నువ్వు పనికిరావు. మరోపని చూసుకో. అంతేగాని, అనవసరమేమిటి ఈ ప్రపంచంలో?...ప్రతీచెత్తా అవసరమే. అందుకని ఏడేళ్లుదాచమని ఇంగ్లీషులో గోలపెడుతూ వుంటాడు మా పెద్దదాని మొగుడు."

"మిమ్మల్ని ఏడేళ్ళూ తప్పకుండా జ్ఞాపకంలో దాచుకుంటాను లెండి."

"బాగుపడతావు...నీ కథల్లోమాత్రం నన్ను రానేక...మా కోడళ్ళూ కొడుకులూ అందరూ అవి చదివేవాళ్ళే...చంపేస్తారు. ఓ రామాయణం భారతం ఎవరికీ అక్కర్లేదు."

"ఈ రోజుల్లో అవెవరికి కావాలిలెండి!"

"అన్నావా?...అమాటే నేనంటే మా వెంకటలక్ష్మి, మనోహరీ, మాణిక్యం, రాజరత్నం, గోపాలస్వామీ, మోహనుడూ, రామచంద్రమూర్తీ, సత్యం, సరితా, వసూ—అందరూకలిసి నామీద దండెత్తుతారు."

"కష్టమేనండి."

"అంతకష్టంకాదులే!... నేనూ కొంచెం నిమ్మపాలుండి వాళ్ళతో కలిసిపోతాను. దాంతో ఎక్కడివాళ్ళక్కడ ఖిన్నులై ఊరుకుంటారు."

"ఇంతకీ నేను వొచ్చినపని..."

"చేసుకో నాయనా! చేసుకో!...చదువుకున్నవాడివి. సంపాయిస్తున్నట్టున్నావు... అన్నట్టు-ఉద్యోగం ఏంటిబాబూ?"

"జూలాజికల్ స్పెసిమెన్ కలెక్టరు"

"అంతా ఉద్యోగమే?"

"అవునండి"

"మరలాగ ఉన్నావేం?"

"నేనసలు ఇంతేనండి"

"బాగు బాగు... ఇంత పెద్ద కల్లెటువిగదా! సూటైనా వేసుకోలేదేం నాయినా?"

"ఇది జాతీయదుస్తులు లెండి"

"మహబాగు...మా మూడోకుర్రాడికి సెలవు దొరికి ఇవాళ మెయిల్లోవస్తే నిన్ను చూపెట్టి కొంచెం బుద్ధిచెప్తును... వాడు చేసేది మేష్టరుగిరీయే కాని, వేసేసూట్లు మనకందవు!"

"అలాటివి ఎవరియిష్టం వారిదిలెండి!"

"సరిగ్గా అన్నావు. మా సౌమిత్రికి కాఫీ స్ట్రాంగ్‌గా ఉండాలి; సరోజకి టీ తప్ప పనికిరాదు..."

"మీ జానకికి..."

"సారీ! మా జానకిని నువ్వెరుగుదువన్నమాట."

"అబ్బే, నాకు తెలీదులెండి."

"సిగ్గుపడుతున్నావుగాని, అది తెలీకపోడం ఏవిటీ? కథలురాసే అబ్బాయిలంతా తనమీదే రాస్తారని అది అంటే ఏమో అనుకున్నాను. అయినా, దానికేం! రాణి!...నీకు బాగా తెలుసున్నమాట!"

"నిజంగా నాకామె ఏమీ తెలీదండీ!"

"మరి దాని పేరు యెలాగ తెలిసిందయ్యా, విచిత్రం?"

"మీరు వర్ణిస్తూన్న పేర్లన్నీ విన్నాక ఆ పేరు ఉండదని అనుకోలేకపోయాను."

"బాగుబాగు! ఏం విడ్డూరం మనుషులూ!"

"ఏదోరకం మనుషులంగానీ-ఈ ఇంటివారు మీరేనా చెప్పండి... గంటనించి అడుగుతున్నాను."

"ఏం అమాయకుడివి బాబూ! అలా అనుకోగూడదుగానీ, కిందటి ఖరసంవత్సరంలో పోయిన వాడు తిరిగొస్తాడా ఏమైనానా—సరిగ్గా మా ఛాముండేశ్వరరావులాగే మాట్లాడుతున్నావు. వాడు బతికి బాగుంటే—"

"నేను చచ్చిఉండేవాణ్ని-వేడుతున్నాను."

"అంత అశుభం కోరుకోకు నాయినా!... తథాస్తు దేవతలు తథాస్తు అనేస్తారు. మా మూడో కోడలు పెదతండ్రి తోడు..."

"దొడ్డమ్మగారూ! మీ కోడళ్లనీ, వారి బంధువుల్నీ, వారిబంధువుల బంధువుల్నీ వొదిలేయండి. నాకు ఓ గది కావాలి. ఈ ఇంట్లో దొరుకుతుందా?"

"పెళ్ళయిందా నాయినా?"

"అయింది."

"అత్తారిదేవూరూ?"

"రాజమండ్రీ."

"నియోగులా ఏమిటీ?"

"అవును."

"అయితే...అయ్యో! వెళ్ళిపోతున్నావేం?"

"వొద్దుబాబో వొద్దు...నాకిక్కడ వొట్టినే ఇచ్చినా గదివొద్దు."

"అయ్యో...రాజమండ్రీ అయితే, సురవరపు వారి...అదేం? పరుగే! అవ్వ!...హవ్వ! అంత పరుగు! వెళ్ళిపోయాడే!"

★